
మినీ కథ

# ఆమె అనుకోలేదు



– అడపా రామకృష్ణ

ఆఫీసు పని మీద విజయవాడ బయలుదేరాను. రైలు ఏలూరు ప్లాట్‌ఫారం మీద ఆగ్గానే, టీ కోసం కిటికీ దగ్గర కూర్చున్న నాకు నడిగా స్టెనో సుమతి, క్యాషియర్ సతీష్ ప్లాట్‌ఫాం మీద కనిపించారు. నన్ను కూడా అదే టైంలో చూసారు. నేనున్న కంపార్ట్‌మెంట్‌లోకి దొరబడ్డారు. నవ్వుతూ నాకెదురుగా సుమతి మరో ప్రక్క సతీష్ చోటుచేసుకున్నారు.

ఆఫీసు సంగతులేమన్నా వున్నాయా?' సుమతి వైపు కుతూహలంగా చూస్తు అడిగాను. అందంగా, ముద్దుగా చింతపిక్క రంగు చుడీదార్లో చూడముచ్చటగా వుంది. చెవులకి పెద్ద సైజు దుద్దులు, రెండు నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. మెడలో సన్నపాటి చెయిన్ తళుక్కుమంటోంది. సినీమ్యాగజైన్ తిరగేస్తున్న సతీష్ నా మాట విని –'నాల్రోజులు తర్వాత సుమతిగారు, ఇదేనండి ఆఫీసుకు రావడం' అన్నాడు. కారణం ఏమన్నట్లు జాలి చూపులు చూపాను.

'అబ్బే అదేం లేదండి' అంది మొహమాటుగా ఏదో దాస్తున్నట్లు. నాకు మాత్రం ఆమెతో ఏదో ఒకటి మాట్లాడుతూ కాలక్షేపం చేయాలని వుంది.

'మీ చెవులకున్నది అమెరికెన్ డైమండ్సా! వెరీ ఎట్రాక్టివ్, ఎక్కడ తీసుకున్నారు, ఎంతయ్యింది' నా ప్రశ్నల పరంపరకి తట్టుకోలేక సమాధానం చెప్పింది. చెవులకి మూడువేలు అయిందండి. ఈ చెయిన్ మాత్రం మిషన్‌మేడ్, అయిదు వేలు, వైజాగ్‌లో కొన్నాను. మీ శ్రీమతికి కూడా తీసుకోకూడదు' అంది. ఆప్యాయతగా నా వైపు చూస్తూ, మరో బాధ్యత గుర్తు చేసింది.

అంతలో సతీష్ పిడుగులాంటి వార్త చెవిన వేశాడు. నాల్రోజుల క్రితం విజయవాడ స్టేషన్‌లో మెట్లు దిగుతున్నప్పుడు తోపులాట జరిగింది. ఆ టైంలో ఎవడో వెధవ సుమతి మెడలో గోల్డ్‌చెయిన్ దొంగిలించేసాడు అన్నాడు. ఎంతో బాధపడుతూ.

అప్పుడు చెప్పింది సుమతి– అవునండి, ఆ రద్దీలో తూలిపడ్డాను. చున్నీ సరిజేసుకునేసరికి మెడ మీద ఏదో రాపిడి జరిగింది. చూసుకునే సరికి చెయిన్ లేదు. గట్టిగా అరిచాను. లాభం లేకపోయింది. విలవిలలాడిపోతూ అంది.

పోలీస్ కంప్లైంట్ ఇవ్వలేదా ఆదుర్దాగా అడిగాను.

లేదండి, ఆ దొంగలెవరలో పోలీసులకు తెలిసినా, వస్తువు దొరికినా, ఒకంతట ఇవ్వరు. కోర్టులంట తిరగాలి. ఎందుకొచ్చిన తలనొప్పి. ఇంట్లో చెప్పగానే పోతేపోయింది ఆరువేలే కదా మరో కొత్త డిజైన్ కొనుక్కోమని ఏనిమిది వేలిచ్చారు. దాంతో ఇవి కొన్నాను. అంది గొప్పగా హుందాగా ఓరమారు మెడలోని చెయిన్ సవరించుకుంటూ.

విజయవాడ చేరుకున్నాం. అంతా కోలాహలం. హడావుడీ. ఒకరి వెంట ఒకరు. ఒకటే పరుగు. ముగ్గురం మెయిన్‌గేటు దాటాం. ఆ రద్దీలో ఎవరో ఒక వ్యక్తి యాకుదుగా ముందుకొచ్చి, సుమతి చేతిని గట్టిగా పట్టుకుని ప్రక్కకులాగి, చెంపమీద చెళ్ళున లెంపకాయ కొట్టి– ఓ సిస్, రోల్డ్‌గోల్డ్ గొలుసు వేసుకుని బంగారం గొలుసులా స్టిల్ ఇచ్చావ్, నన్నే టోకరా కొట్టిస్తావా, కబడ్దార్' అని 'గట్టిగా అరుస్తూ జట్ స్పీడులో ఎటో దూసుకుపోయాడు. సుమతికి నోటిమాటరాక బిక్కురాలై దిక్కులు చూడసాగింది. సతీష్ మెరుపులా ఆ దొంగ వెనుకే పరిగెత్తాడు. దొరకలేదు. నిరాశతో, అలిసిపోయి వచ్చి ఓర్తర చూపు చూసాడు.

ఆరువేల గోల్డ్ చెయిన్ నడన్నా అరవై రూపాయల రోల్డ్ గోల్డ్‌గా టర్న్ అయిపోవడం సుమతి భరించలేక పోయింది. ముఖం చాటు చేసుకుంటూ రిటర్న్ ట్రయిన్ కోసం ప్లాట్‌ఫారం మీదికి పరుగులాంటి నడకలో కనిపించింది. ఇలా జరుగుతుందని అనుకోలేదు.

